క్లుప్తంగా

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

తంబళ్లపల్లె : మండలంలోని అర్హులైన ఎస్సీ అభ్యర్థులు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఉపేంద్ర రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సోమవారం నుంచి మే 10వ తేదీలోపు అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

స్టూడెంట్ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హేమంత్



నిమ్మనపల్లె: వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నిమ్మనపల్లి మండలం వెంకోజిగారి పల్లెకు చెందిన హేమంత్ కుమార్‌ను నియమించారు. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీను ప్రకటించింది. హేమంత్ కుమార్‌ను స్టూడెంట్ వింగ్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించారు. ఈ సందర్భంగా ఆదివారం హేమంత్‌కుమార్ మాట్లాడుతూ... తన నియామకానికి సహకరించిన ఎంపీ మిథున్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ , మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి, వైఎస్ఆర్సీపీ మండల అధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, స్టూడెంట్ సమస్యలను పరిష్కరించడానికి ముందుంటానన్నారు.

పాస్టర్ మృతికి నివాళి


జైదీప్ రాజా (ఫైల్)

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో జీసస్ ఇన్ లైఫ్ మినిస్ట్రీ మందిరానికి చెందిన దైవ సేవకుడు పాస్టర్ బీఆర్ జైదీప్ రాజా (చిట్టి) (51) మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పరిసర ప్రాంతాల్లోని దైవ సేవకులు, విశ్వాసులు, ఆత్మీయులు, మిత్రులు వందలాదిగా తరలి వచ్చి పాస్టర్ భౌతికకాయం ఎదుట ఘనంగా నివాళులు అర్పించారు. సోమవారం అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు పేర్కొన్నారు.

బీఎస్పీ మండలాధ్యక్షుడిగా గణేష్


నియామక పత్రం అందుకుంటున్న గణేష్


పెద్దతిప్పసముద్రం: బహుజన సమాజ్ పార్టీ మండలాధ్యక్షుడిగా మండలంలోని బూర్లపల్లికి చెందిన ఆటో గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు గౌతంకుమార్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లికార్జున ఆధ్వర్యంలో గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదివారం నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో బి.కొత్తకోట పార్టీ మండలాధ్యక్షుడు సిద్దూ, అంజి, భాస్కర్, నరేంద్ర, శ్రీనివాస్, క్రిష్ణప్ప, గంగాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం విడుదల చేయాలి


సి. లోకనాథం

పీలేరురూరల్ : ఫీజురీయిబర్స్‌మెంట్, స్కాల‌ర్‌షిప్పులు మొత్తం తక్షణమే విడుదల చేయాలని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సి. లోకనాథం అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గతంలో ఐదు సంవత్సరాల పాటు విద్యార్థులకు ఫీజు రీయిబర్స్‌మెంట్ ఇవ్వడం జరిగిందని, దీంతో విద్యార్థులు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రశాతంగా చదువులు కొనసాగించారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు పూర్తి అవుతున్నా ఇంత వరకు ఫీజు రీయిబర్స్‌మెంట్ జమ కాలేదని, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌సిప్పులు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

తెట్టు పాలేటి గంగమ్మ గుడికి రూ. లక్ష విరాళం


గుడి అభివృద్ధికి విరాళ సొమ్మును అందజేస్తున్న జీఎం రెడ్డి

కురబలకోట: మండలంలోని తెట్టు పాలేటి గంగమ్మ గుడికి న్యాయవాది జీఎం రెడ్డి రూ. 1,00,116 నగదును విరాళంగా అందజేశారు. గుర్రాల రెడ్డెమ్మ మనవడు చిన్నరెడ్డి జ్ఞాపకార్థం ఆలయ అభివృద్ధికి విరాళాన్ని అందజేసినట్లు ఆలయ ధర్మకర్త పూజారి అంజి ఆదివారం తెలిపారు. దాత జీఎం రెడ్డిని గ్రామస్థులతో పాటు పలువురు అభినందించారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా


అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటికిటలాడింది. చల్లంగ చూడమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం నుంచే భక్తుల రాక మొదలైంది. మహిళలు అమ్మవారి కోనేట్లో పవిత్ర స్నానమాచరించి అమ్మవారి ముందు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు ఆలయమెట్లకు పూజలు నిర్వహించారు.

ఈ వాహనాలను తరలించండయ్యా..!


పార్కింగ్ చేసి వదిలేసిన వాహనాలు

గుర్రంకొండ: స్థానిక మార్కెట్‌యార్డులో గుర్తు తెలియని వాహనాలను ఏళ్ల తరబడి పార్కింగ్ చేసి అలాగే వదిలేశారు. మార్కెట్‌యార్డులో నిత్యం టమాటాల వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ గజిబిజిగా మారుతోంది. అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపివేస్తుండడంతో రైతులు ఇబ్బంది పడతున్నారు. ఈనేపథ్యంలో గతకొన్ని ఏళ్లుగా గుర్తు తెలియని వాహనాలను కొంతంది వ్యక్తులు అక్కడే వదలి వెళ్లిపోయారు. స్థానిక మార్కెట్ యార్డు ఉపకార్యాలయం ముందువైపే వాహనాలు నిలిపి ఉంచిడం గమనార్హం. ఏళ్ల గడుస్తుండడంతో ఎండకు , వానకు తడిసి తుప్పుపట్టిపోతున్నాయి. ఇక్కడ వాహనాలను ఎవరు నిలిపి ఉంచారో అంతుచిక్కడం లేదు. అధికారులు తగు చర్యలు చేపట్టి వాహనాలను తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టాలి

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని సన్మానిస్తున్న ఐటీ విభాగం సభ్యులు

తంబళ్లపల్లె : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ అరాచకపు పాలన, వైఫల్యాలను అందరూ ఏకమై ఎండగట్టాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎర్రసానిపల్లెలో శ్రీ ఏటిగంగమ్మ జాతరకు ఆయన హాజరయ్యారు. ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సోషల్‌మీడియా తంబళ్లపల్లె ఐటీ విభాగం ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెంగళూరు ఐటీ విభాగం సభ్యులు ఎమ్మెల్యేను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ బలోపేతానికి అందరూ కృషిచేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్‌మీడియా సభ్యులు ఏకమై కూటమిప్రభుత్వం సూపర్‌సిక్స్ పేరుతో అన్ని వర్గాలను మోసం చేసిన తీరును ప్రజలకు వివరించాలన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా అందరూ ఐక్యంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ సుగుణమ్మ, సర్పంచుల సంఘం అధ్యక్షులు సుధాకరరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, నాయకులు భద్ర, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణరెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆవేదన టెలిఫిలిం ప్రారంభం

– సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిత్రీకరణ


మునిగోపాలకృష్ణను సన్మానిస్తున్న కురవంక సర్పంచ్ చలపతి తదితరులు

మదనపల్లె : వృద్ధాప్యంలో వయోవృద్ధుల జీవనప్రయాణాన్ని ఇతివృత్తంగా తీసుకుని వారి సాధకబాధలను చిత్రరూపంలో ఆవిష్కరించే ప్రయత్నమే ఆవేదన టెలిఫిలిం అని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్.ఎస్.మునిగోపాలకృష్ణ తెలిపారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఆవేదన షార్ట్‌ఫిలింను ఆవిష్కరించారు. రెండో భాగం నిర్మాణం త్వరలో ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..ఇప్పటివరకు వృద్ధాప్యంలో ఉన్న తాము తమ సమస్యల పరిష్కారానికే పరిమితం అయ్యామని, ఇకపై సమాజ పునర్నిర్మాణానికి ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా సామాజిక సేవలకు సంబంధించి ఎస్.మునిగోపాలకృష్ణను సీనియర్ సిటిజన్స్ దుశ్శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ గౌరవాధ్యక్షులు వైఎస్.మునిరత్నం, కురవంక సర్పంచ్ పసుపులేటిచలపతి, టీఎస్ఏ.కృష్ణమూర్తి, గొల్లపూడి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కోళ్లబైలులో అభివృద్ధి పనులు

– ఎమ్మెల్యే షాజహాన్‌బాషా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం కోళ్లబైలు పంచాయతీలో జరగాల్సిన సమావేశానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బీసీ.జనార్ధన్‌రెడ్డి హాజరుకాకపోవడంతో, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా హాజరై శిలాఫలకాన్ని ప్రారంభించారు. అనంతరం సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ..కోళ్లబైలు పంచాయతీలో కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రస్తుతం మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీపథకం నిధులతో రూ.93 లక్షలతో సీసీరోడ్లు నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. కోళ్లబైలు–2 సచివాలయం మెయిన్ రోడ్ నుంచి జామకాయల కాలనీకి రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. కోళ్లబైలు పంచాయతీలో కబ్జాదారుల చేతుల్లో ఉన్న 20 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పేదప్రజలకు కాలనీ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. సొంత నిధులతో పంచాయతీలో 425 ఎల్ఈడీ లైట్లు వేయించామన్నారు. కార్యక్రమంలో నవీన్‌చౌదరి, బెల్లే రెడ్డిప్రసాద్, రామకృష్ణ, నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు దీపారాధన


అంబేడ్కర్ విగ్రహం వద్ద దీపారాధన చేస్తున్న బీజేపీ నాయకులు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిమ్మనపల్లె : మండల బీజేపీ అధ్యక్షుడు రెడ్డివారి సునీల్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆదేశాల మేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం నిమ్మనపల్లె బస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం, పరిసరాలను శుభ్రపరిచారు. నాయకులతో కలిసి దీపారాధాన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు భవాని, నాయకులు సోమశేఖర్, పరమేష్, శ్రీరామ, రమణ, ముబారక్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు నివాళి

బి.కొత్తకోట: స్థానిక జ్యోతిచౌక్‌లోని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం సాయంత్రం బీజేపీ నాయకులు శుద్ధి చేశారు. సోమవారం అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని నీళ్లు, పాలతో శుభ్రపరిచి పూలమాలతో నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూ అంబేడ్కర్ స్ఫూర్తితో, ఆయన అడుగుజాడల్లో నడవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముకుంద, గోరంట్ల రమేష్, శీలం రంగా, షౌకత్‌అలీ, కృష్ణమూర్తి, సకలారాము, కార్తీక్‌బాబు, మునిరాజ పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల సత్తా

పీలేరురూరల్ : ఇంటర్ ఫలితాల్లో స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆర్. సుధానంద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నాగార్జునరెడ్డి తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో ఎస్. యాస్మిన్ 988, పూజిత 980, రెడ్డిలక్ష్మి 979, బైపీసీలో రూపిక 973, జి. ఈశ 973, ఎ. షర్మిన్ 965, గౌసియ 960 సాధించినట్లు తెలిపారు. అలాగే సీఈసీలో జి. ఉష 962, డి. పల్లవి 958, పి. గిరీష్మ 957 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ వచ్చినట్లు వివరించారు. డైరెక్టరు జనార్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్, లోకేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.


ఎస్. యాస్మిన్


జి. ఈశ


ఎం. రూపిక


జి. ఉష

వైభవంగా ఏటిగంగమ్మ తిరునాల


ప్రత్యేక అలంకరణలో ఏటిగంగమ్మ తల్లి

తంబళ్లపల్లె : మండలంలోని ఎర్రసానిపల్లె పంచాయతీ ఎగువముత్రవారిపల్లె వద్ద వెలసిన శ్రీ ఏటిగంగమ్మ తిరునాలను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. పూజారి మదన్‌మోహన్ అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. విద్యుత్ దీపాల అలంకరణతో, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ, చాందినీబండ్ల మెరవణి భక్తులను అలరింపజేశాయి.

చౌడేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరిదేవి

కలకడ : మండలంలోని కరదిరాయచెర్వు గ్రామంలో వెలసిన శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలను తొగటవీరక్షత్రియుల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొగటవీరక్షత్రియులు, ఇతర ప్రదేశాల వారుకలిసి అలంకరించిన చాందినీ బండిలో సింహవాహనంపై అమ్మవారిని గ్రామ పురవీధులలో ఊరేగించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. అనంతరం పవిత్ర అమ్మవారి జ్యోతులు, భక్తులు ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన అగ్నిగుండప్రవేశం చేశారు.

దాహార్తిని తీర్చడం అభినందనీయం

రాయచోటి అర్బన్ : మండుతున్న ఎండలలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జిల్లా నూర్‌బాషా, దూదేకుల సంఘం కృషి చేస్తుండడం అభినందనీయమని నూర్‌బాషా, దూదేకుల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.సిద్దయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయం వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని సంఘం నేతలతో కలసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పగిడిపల్లె పకీర్ సాహెబ్, మహమ్మద్ రఫీ, ఇనాయతుల్లా, సత్తార్, నాగరాజు, దర్బార్‌బాషా, పీరుసాహెబ్, పకీర్‌సాహెబ్, చిలకల మహమ్మద్, రహంతుల్లా పాల్గొన్నారు.

సుభాష్‌రెడ్డి సేవలు మరువలేనివి


సుభాష్ రెడ్డి చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కురబలకోట: మండల మాజీ జెడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఎల్. సుభాష్ రెడ్డి సేవలు మరువలేనివని అంగళ్లు మల్లయ్యకొండ ఆలయ కమిటీ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి, సీనియర్ నాయకుడు ముదివేడు వైజి. రమణ అన్నారు. సుభాష్ రెడ్డి ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతి అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. జంగావారిపల్లె వద్ద రేగడ వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం ఆయన సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రాంతాల వారితో పాటు పరిసర మండలాల వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుభాష్ రెడ్డి కుమారుడు ఎల్. సందీప్ రెడ్డి కుటుంబీకులతో కలసి తండ్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాకర్ల కృష్ణమూర్తి, ముదివేడు వైజీ రమణ మాట్లాడుతూ సుభాషప్ప మండలానికి చేసిన సేవలు మరుపురానివన్నారు. మనసున్న మంచి మనిషిగా ఆయన పేరు తెచ్చుకున్నారన్నారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ర్యాహించి చూపరులను ఆకట్టుకున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి


ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పీలేరురూరల్ : మండలంలోని యర్రగుంట్లపల్లె పంచాయతీలోని అనంతరాయునికుంట వద్ద గల శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. శని, ఆదివారాలు రెండు రోజుల పాటు స్వామివారికి అభిషేకం, ఆకుపూజ నిర్వహించారు. స్వామివారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. నిర్వాహకులు కిషోర్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెండు రోజుల పాటు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ సైనికుడి కుటుంబానికి న్యాయం జరగాలి

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలం మూరేవాండ్లపల్లి గ్రామం పెద్దవంకపల్లికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి లక్ష్మన్న కుమారుడు వెంకటాద్రి రెవెన్యూ అధికారుల వేధింపులతో ఆత్మహత్యకు పాల్పడి అకాల మరణం చెందిన విషయం తెలిసిందే. తన మృతికి స్థానికులు, రెవెన్యూ అధికారుల వేధింపులే కారణమని సుసైడ్ నోట్ రాసిపెట్టాడు. ఈ సందర్భంగా మాజీ సైనికుని కుటుంబానికి ప్రభుత్వం స్పందించి వెంటనే న్యాయం చేయాల్సిన అవసరం ఉందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వెంకటాద్రి ఆత్మహత్య చేసుకుని పది రోజులు గడుస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు మృతుని కుటుంబానికి న్యాయం చేయక పోగా బాధిత కుటుంబానికి అండగా నిలిచిన మాజీ సైనికుల సంక్షేమ సంఘం నేతలపై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేయడం దారుణమన్నారు. రాజ్యాంగ బద్ధంగా, శాంతియుతంగా నిరసన తెలపడమే మాజీ సైనికులు చేసిన నేరమా తెలపాలన్నారు. మాజీ సైనికులు ఏమి తప్పు చేశారో చెప్పాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టరు, సబ్ కలెక్టరు, మదనపల్లి డీఎస్పీ తదితరులను కలిసి విన్నవించినా ఇప్పటి వరకు ఏలాంటి స్పందన లేక పోవడం శోచనీయన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయి దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు అప్రజాస్వామికమన్నారు. మృతి చెందిన వెంకటాద్రి కుటుంబానికి అండగా ఉంటామని ఉద్ఘాటించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని శాంతియుత నిరసన తెలియజేసిన మాజీ సైనికుల సంక్షేమ సంఘంపై పోలీసులు నమోదు చేసిన కేసును ఉప సంహరించుకోవడంతో పాటు వెంకటాద్రి కుటుంబానికి నష్టపరిహారం, ఐదెకరాల భూమిని కేటాయించి ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్ చేశారు.

పోలేరమ్మతల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు


పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దమండ్యం: మండలంలోని కలిచెర్ల గ్రామంలో కుషావతీ నది ఒడ్డున విప్పవనంలో వెలసిన పోలేరమ్మ తల్లికి తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం రాత్రి పోలేరమ్మ తల్లి తిరునాల సందర్భంగా గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకి స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘనస్వాగతం పలికారు. పండుగ వాతావరణంలో పోలేరమ్మ తల్లి తిరునాలను జరుపుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కలిచెర్ల సింగిల్ విండో చైర్మన్ కడప సుధాహరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, పార్టీ జిల్లా యాక్టివిటి కార్యదర్శి భైన మధూకరరెడ్డి, సర్పంచ్‌లు జింకా విశ్వనాథ, సోదనపల్లె బాషా, ఎంపీటీసీలు బోడెం రవితేజ, మంచూరి జయరాం, కో ఆప్షన్ మెంబర్ ఖాదర్‌వలీ, నాయకులు కోసూరి రామక్రిష్ణ, రామిరెడ్డి, మాజీ సర్పంచ్ నజీర్ అహ్మద్, మండల కన్వీనర్ కన్నపు పెద్దరెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1978–79 ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. దాదాపు 45 సంవత్సరాల అనంతరం పూర్వ విద్యార్థులు ఒక్క చోటికి చేరి నాటి జ్ఞాపకాలు నెమరు వేసుకున్నారు. అప్పటి గురువులు వెంకటరెడ్డి, రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డిలను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ సుదీర్ఘకాలం అనంతరం తమ క్లాస్‌మెట్స్‌తో కలుసుకోవడం, తమ గురువులను సన్మానించడం తియ్యని అనుభూతినిస్తోందని తెలిపారు.

ఆత్మీయ కలయిక

కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె విశ్వజ్యోతి ఉన్నతపాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక నిర్వహించారు. 2011–12 సంవత్సరంలో 10వ తరగతి విద్యను అభ్యసించిన విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో కలిసి కలసి వచ్చి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యాభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. నాటి ఉపాధ్యాయులు గంగాద్రినాయుడు, కుమార్ నాయుడు, బాబ్‌జాన్, రఫీ, రెడ్డెప్పరెడ్డి, సయ్యద్‌బాష, హసన్, హుస్సేన్, హైమావతి, నాగరత్నలను పూలమాలలు వేసి సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు.


కలకడ: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు